క్లుప్తంగా

తీర్మానాన్ని తిరస్కరించిన కమిషనర్

పుత్తూరు: తనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి కౌన్సిల్ తీర్మానాన్ని మినిట్ బుక్‌లో పొందుపరచడానికి కమిషనర్ మంజునాథ్‌గౌడ్ తిరస్కరించినట్లు చైర్మన్ హరి ఆరోపించారు. అభివృద్ధి పనులకు సహకరించడం లేదంటూ మెజారిటీ కౌన్సిలర్లు ముక్తకంఠంతో కమిషనర్‌పై తిరుపతి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలన్న తీర్మానాన్ని మినిట్‌బుక్‌లో రాయడానికి అనుమతించకపోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. కౌన్సిలర్లతో కలిసి వెళ్లి కలెక్టర్‌కు నేరుగా ఫిర్యాదు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

నింద్ర ఎంపీపీ రాజీనామా



రాజీనామా పత్రాన్ని ఇస్తున్న నింద్ర ఎంపీపీ

నింద్ర: మండల ఎంపీపీ దీప సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. సోమవారం చిత్తూరు జిల్లా పరిషత్ సీఈఓను కలిసి తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు.

దివ్యాంగ నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్: దివ్యాంగ నిరుద్యోగులకు ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు యూత్ ఫర్ జాబ్స్ ఫౌండేషన్ సంస్థ నిర్వాహకురాలు భవ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. దివ్యాంగ నిరుద్యోగులకు ఉచితంగా కంప్యూటర్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. విద్యార్హత కలిగి 19 నుంచి 34 ఏళ్లలోపు వయసు ఉండి తమ పని తాము చేసుకునే వారై ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న దివ్యాంగ నిరుద్యోగులు విద్యార్హత పత్రాలతో పాటు 4 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్, సదరం సర్టిఫికెట్‌తో అక్టోబర్ 1వ తేదీన తిరుపతి జిల్లా కేంద్రంలోని భవానీనగర్‌లో ఉన్న యూత్‌ఫర్ జాబ్స్ ఫౌండేషన్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. వివరాలకు 9347411952, 9392923884 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

వైభవంగా బకాసుర బలి



బలి బండిని తీసుకెళ్తున్న కళాకారులు

తవణంపల్లె: మండల కేంద్రమైన తవణంపల్లెలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిలో సోమవారం బకాసురబలి బండి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ద్రౌపదీ సమేత పాండవుల ఉత్సవ విగ్రహాలకు అభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం బకాసురుడికి ఆహారం తీసుకెళ్లడానికి భీముడు గ్రామాల్లో తిరిగి ఆహారం తీసుకుని బండితో భీముడు వేషధారి పలు గ్రామాల్లో తిరిగి ఆహారం సేకరించారు. భక్తులు పూజలు చేసి పలు ఆహార పదార్థాలను అందించారు. రెండు బండ్లలో కళాకారులు భీముడి వేషధారణలో పర్యటించారు. వచ్చే నెల ఒకటో తేదీన బుధవారం ఆలయంలో దాతల సహకారంతో ద్రౌపదీదేవి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త గుడిసె మునస్వామి శెట్టి, కార్యనిర్వాహకులు తెలిపారు.

పశువుల పాక కాదు.. పాఠశాలే!

- దుస్థితిలో బండ్రేవుకాలనీ ప్రభుత్వ పాఠశాల
- దుర్గంధభరితంగా పాఠశాల ఆవరణ

కార్వేటినగరం: ప్రభుత్వ పాఠశాలలను గత ప్రభుత్వం నాడు–నేడు పేరుతో ఆధునీకీకరిస్తే అదే పాఠశాలలు ప్రస్తుతం పశువుల పాకలను తలపిస్తున్నాయి. మండల పరిధిలోని బండ్రేవు కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణ పశువులకు నిలయంగా మారి దుర్గంధాన్ని వెదజల్లుతోంది. దీనికి తోడు గ్రామంలో మురుగు నీటి కాలువలు లేక పోవడంతో పాఠశాలకు సమీపంలో ఉన్న కొంత మంది మురుగునీటిని పాఠశాల ఆవరణలోకి మళ్లించేస్తున్నారు. దీంతో పాఠశాల ఆవరణమంతా పేడ వాసనతో పాటు మురుగు నీరు వెదజల్లుతున్న దుర్గంధానికి దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. గ్రామస్తులు వ్యాధుల బారిన పడి ఆస్పత్రి పాలవుతున్నారు. అదే విధంగా పాఠశాలలో కొంత మంది ఆకతాయిలు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. వారు వ్యర్థాలను పాఠశాల వరండాల్లో పడేయడంతో గోడలు కూడా దుస్థితికి చేరుకున్నాయి. విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన తాగునీటి పైపులను ధ్వంసం చేయడంతో తాగు నీటి లీకేజీ అయి పాఠశాల ఆవరణ బురదమయంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతోనే పాఠశాల ఇలాంటి దుస్థితికి చేరుకుంది. సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల ఆవరణలో పశువులు, మురుగునీరు నిల్వ లేకుండా చూడాల్సి ఉంది.



పశువుల పాకను తలపిస్తున్న బండ్రేవు కాలనీ పాఠశాల



తాగునీటి పైపులైన్ లీకేజీతో బురదమయం



పాఠశాల మరుగుదొడ్ల వద్ద మురుగునీటి నిల్వ



పాఠశాల వరండాల్లో వ్యర్థాలను కాల్చిన ఆకతాయిలు

వ్యక్తిగత కారణాలతో నింద్ర ఎంపీపీ రాజీనామా

చిత్తూరు కార్పొరేషన్: వ్యక్తిగత కారణాలతో నగరి నియోజకవర్గం నింద్ర మండలం ఎంపీపీ దీప తన పదవికి రాజీనామా చేశారు. సోమవారం తన రాజీనామా పత్రాన్ని జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడుకు ఆమె అందజేశారు. రాజీనామాను ఆమోదించి తదుపరి ఎంపీపీగా వైస్ ఎంపీపీ–1, 2లో ఒకరిని నియమించేందుకు కలెక్టర్‌కు నివేదిక పంపనున్నారు. నివేదిక పరిశీలించిన తర్వాత నింద్ర ఎంపీపీని కలెక్టర్ ఎంపిక చేస్తారని జెడ్పీ అధికారులు వెల్లడించారు.

సొసైటీ అభివృద్ధికి సహకరించండి

యాదమరి: సహకార సంఘంలో రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని సింగిల్‌విండో అధ్యక్షురాలు చిత్రానాయుడు కోరారు. సోమవారం ఆమె స్థానిక సహకార సంఘం కార్యాలయ ఆవరణలో జరిగిన మహాజన సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నదాతలకు అవసరమైన మేరకు విరివిగా రుణాలు మంజూరు చేస్తున్నామని చెప్పారు. అయితే రైతులు రుణాల చెల్లింపులో వెనుకబడుతున్నారని, తద్వారా సంఘం లక్ష్యం నీరుగారుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి తాకట్టు రుణాలను రూ.3 లక్షల నుంచి 5 లక్షల వరకు అందిస్తామన్నారు. పంట రుణాల కింద రూ.5 లక్షల వరకు మంజూరు చేస్తామని, ఈ అవకాశాన్ని రైతన్నలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రూ.8 లక్షల విలువైన చెక్కులను పలువురు రైతులకు అందించారు.

రోడ్డున పడ్డ సచివాలయ ఉద్యోగులు



నిరసన వ్యక్తం చేస్తున్న సచివాలయ సిబ్బంది

పుత్తూరు: ఆత్మగౌరవ పరిరక్షణకు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు సచివాలయ సిబ్బంది సోమవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ బాట పట్టినట్లు వెల్లడించారు. 9 నెలల అరియర్స్‌ను విడుదల చేయాలని, వలంటీర్ల విధుల నుంచి విముక్తి కల్పించాలని, స్పష్టమైన ప్రమోషన్ చానల్ ఏర్పాటు చేయాలని, రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు వెంటనే ప్రకటించాలని, సెలవు రోజుల్లో బలవంతపు విధుల నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పరంధామ, రాజేష్, దినకర్, తిరుమలయ్య, అరుల్‌రాజ్, జ్యోత్స్న, భాగ్యలక్ష్మి, జ్యోతి, శివమ్మ పాల్గొన్నారు.

జీఎస్టీ వివరాలు ప్రదర్శించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నగరి: వ్యాపారవేత్తలు తగ్గిన జీఎస్టీని చూపే విధంగా బోర్డు రూపంలో గానీ, పోస్టర్ రూపంలో గానీ తమ షాపు వద్ద ప్రదర్శనగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం నందు జీఎస్టీ 2.0పై అవగాహన కల్పించే విధంగా డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ పూర్ణం ఆధ్వర్యంలో వ్యాపారవేత్తలు, కాంట్రాక్టర్లు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుండి ఓంశక్తి గుడి వరకు ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఓంశక్తి ఆలయం వద్ద మానవ హారం చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ వ్యాపారవేత్తలు తగ్గిన జీఎస్టీని చూపే విధంగా బోర్డు రూపంలో, పోస్టర్ రూపంలో తమ షాపు వద్ద ప్రదర్శనగా ఉంచాలన్నారు. పట్టణ ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాలు, తగ్గిన జీఎస్టీ రుసుము, పూర్వపు జీఎస్టీ రుసుము ఫ్లెక్సీ రూపంలో ముద్రించి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ పూర్ణం మాట్లాడుతూ ఎవరైనా వ్యాపారవేత్తలకు గాని ప్రజలకు గాని జీఎస్టీ మీద ఎటువంటి సందేహాలు ఉన్నా టోల్‌ఫ్రీ నెంబర్ 1100కు గానీ, 1195కు గానీ ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ఫిర్యాదు కూడా చేయవచ్చన్నారు. ఈ ర్యాలీలో పురపాలక సిబ్బంది, నగరి పట్టణ వ్యాపారవేత్తలు, కాంట్రాక్టర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



గర్భిణులకు, వివిధ రోగాలను వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

పాలసముద్రం: మహిళా బలంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని నగరి ఏరియా ఆస్పత్రి వైద్యాధికారులు లోకేష్, కార్తికేయన్ తెలిపారు. స్థాయిలో పీహెచ్‌సీ సీహెచ్‌ఓ సుబ్రమణ్యం సమీక్షంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ భాగంగా సోమవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యశిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు సమ్మెలో ఉండడంతో నగరి ఆస్పత్రి వైద్యాధికారులు వైద్యపరీక్షలు చేశారు. డాక్టర్ కార్తికేయన్ మాట్లాడుతూ క్యాన్సర్ తదితర వ్యాధులపై మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పలురోగాలకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శుభలక్ష్మి, ఏఎన్ఎం రాణి, జయలక్ష్మి, గంగాగౌరి, లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ సునీత, శిరీష, లావణ్య, నిర్మల, మైనా, 104 డీఈఓ శరవణన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్టీల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీనివాసులు

గంగాధరనెల్లూరు: ఎస్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే లక్ష్యమని తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం తూగుండ్రం పంచాయతీ, దాసరపల్లి ఎస్టీ కాలనీలో సివిల్ రైట్స్ డే సందర్భంగా ఎస్టీ కాలనీలో సర్వే నిర్వహించి గ్యాస్ కనెక్షన్, ఇంటి పట్టాలు, పెన్షన్లు, డ్వాక్రా రుణాలు, సర్టిఫికెట్ మొదలైన పథకాల గురించి లబ్ధిదారులను ఎంపిక చేసి వివరాలు తెలియజేశారు. తహశీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ మహిళలు ప్రతి ఒక్కరూ డ్వాక్రా సంఘాల్లో చేరాలని, డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు పొందాలన్నారు. ఆ రుణాన్ని ఏదైనా వ్యాపారం చేస్తే ఆర్థిక వృద్ధి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ లోకేష్, ఉపాధిహామీ ఏపీఓ శ్రీనివాసులు, ఏఎస్ఐ దామోదరం, స్థానిక సర్పంచ్ శ్రీ బాబు, ఎంపీటీసీ వాణిశ్రీ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

జీఎస్టీ చెల్లింపుల్లో జాగ్రత్త వహించాలి



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ రేణుక

పుత్తూరు: కేంద్ర ప్రభుత్వం ఇటీవల నూతనంగా విడుదల చేసిన జీఎస్టీ స్లాబులను గుర్తించి చెల్లింపుల్లో ప్రజలు జాగ్రత్త వహించాలని రాష్ట్ర జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రేణుక కోరారు. సోమవారం పుత్తూరు పట్టణంలో జీఎస్టీ నూతన విధానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యాపార వర్గాలు జీఎస్టీ నూతన విధానాన్ని విధిగా పాటించాలని ఆదేశించారు. గతంలో ఉన్న 28 శాతం జీఎస్టీ 18 శాతం తగ్గిందని, అలాగే 12 శాతం 5 శాతానికి తగ్గించారని వివరించారు. కొన్నింటికి జీరో శాతం అమలులోనికి వచ్చిందని వెల్లడించారు. ఈ నూతన విధానం ఈ నెల 22 నుంచే అమలులోకి వచ్చిందన్నారు. వ్యాపార వర్గాలు పాత విధానంలో జీఎస్టీ వసూలు చేస్తే చట్టరీత్యా చర్యలు చేపడతామని హెచ్చరించారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తెరిగి వ్యవహరించాలని సూచించారు. పట్టణంలోని పలు వాణిజ్య సముదాయాల వద్దకు వెళ్లి జీఎస్టీ బోర్డుల ఏర్పాటును పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ చెన్నారెడ్డి, టాక్స్ కన్సల్టెంట్ రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్, వాణిజ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏఐ కమ్యూనికేషన్ నైపుణ్యాలు అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్

నగరి: ఏఐ ఆధారిత కమ్యూనికేషన్ నైపుణ్యాలు విద్యార్థులకు అవసరమని నగరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. ఐదు రోజులపాటు నిర్వహిస్తున్న కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐ సాధనాల మద్దతుతో విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరచడంలో సహాయపడడానికి ×బ్రిడ్జ్ ది గ్యాప్: కమ్యూనికేషన్ స్కిల్స్ ఫర్ ది ఎనేబుల్ వరల్డ్¤ పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఇంగ్లీష్ విభాగం అధ్యాపకులు రేవతి, పంకజలను ప్రశంసించారు. విద్యార్థులు మానవ, ఏఐ ఆధారిత కమ్యూనికేషన్ నైపుణ్యాలను నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఏఐ ఆధారిత నైపుణ్యంపై విద్యార్థులకు ఆత్మవిశ్వాసం, స్పష్టత, ఏఐ ఆధారిత టూల్స్ వినియోగంలో విలువైన అనుభవాన్ని అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో జేకేసీ మెంటర్ లాల్ బాషా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సరస్వతీ.. కాపాడు తల్లీ!







పుత్తూరు: ఆరేటమ్మ, బంగారమ్మ మహిషాసుర మర్దిని అలంకరణలో దేశమ్మ



సరస్వతి దేవి అవతారంలో అమ్మవారు



నవరాత్రి పూజల్లో మాజీ మంత్రి ఆర్కే రోజా

శ్రీరంగరాజపురం: మండలంలోని తయ్యూరు పాయికట్టు ఆరిమాకులపల్లిలో వెలసిన శ్రీఆరిమాని గంగమ్మ నవరాత్రుల బ్రహ్మోత్సవంలో భాగంగా వేకువజామున అర్చనలు, అభిషేకాలు చేశారు. ఉదయం 9 గంటలకు శ్రీసీల గణపతి షోడశపూజ, శ్రీసరస్వతిదేవి హోమం నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసి పుష్పయాగానికి అమ్మవారికి పుష్పాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకులు, అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసి తీర్థప్రసాదాలను అందించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. హరికథా కాలక్షేపం ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారిని పురవీధుల్లో సరస్వతీదేవి భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఉభయదారులుగా తాటిమాకులపల్లి, ఎగువ శెట్టివనత్తం, దిగువ శెట్టివనత్తం, పెరుమాల్‌రెడ్డిగారి ఇండ్లు గ్రామస్తులు వ్యవహరించారు.

లలితాదేవి అలంకరణలో శ్రీమూర్తి అమ్మవారు

మండలంలోని వేణుగోపాలపురం పంచాయతీ సపర్వరాజపురం గ్రామంలో వెలసిన శ్రీమూర్తి అమ్మవారి నవరాత్రి ఉత్సవంలో భాగంగా అమ్మవారు శ్రీ లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమానికి తయ్యూరు గొల్లఇండ్లు, తాటిమాకులపల్లి గ్రామస్తులు, ఘట్టం వంశస్తులు వ్యవహరించారు. భక్తులకు అన్నదానం చేపట్టారు. ఆలయ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చిరంజీవులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరులో..

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలో కొలువైన అల్లియల్లమ్మ తల్లి దసరా శరన్నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా సోమవారం సరస్వతీదేవి అలంకరణలో అల్లియల్లమ్మ తల్లి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో అమ్మవారి మూల ఉత్సవమూర్తులకు సరస్వతీదేవి అలంకరణలో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా సర్విరెడ్డిపల్లి మునిరెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించగా, గంగాధరనెల్లూరు దిగవూరుకు చెందిన ప్రభాకర్ రెడ్డి కుమారుడు అనిల్ రెడ్డి కుటుంబ సభ్యులు దాదాపు 500 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సరస్వతి దేవిగా మహాలక్ష్మి

నింద్ర: మండలంలో సోమవారం వివిధ గ్రామాల్లో జరుగుతున్న దేవీనవరాత్రుల సందర్భంగా సరస్వతి దేవి అవతారంలో ప్రజలకు దర్శన మిచ్చారు. మండలంలోని కేఆర్ పాళెం గ్రామంలో మహాలక్ష్మి ఆలయంలో పూజలు చేశారు. చదువుల తల్లి సరస్వతి మాతగా అలంకరించారు. మహిళలు, విద్యార్థులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

చెవుటి గంగమ్మకు ప్రత్యేక పూజలు

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగ గ్రామంలో వెలసిన చెవుటి గంగమ్మతల్లికి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు, పుష్పపల్లకి సేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారిని వివిధ అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు, దీపారాధన చేపట్టారు. సాయంత్రం భక్తులు తీసుకొచ్చిన పూజసామగ్రితో పుష్పపల్లకిలో వివిధ సుగంధ పుష్పాలతో అలంకరించారు.

సరస్వతీ దేవీ అలంకరణలో బంగారమ్మ

కార్వేటినగరం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం బంగారమ్మ సరస్వతీదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులు అమ్మవారికి సమర్పించిన పట్టువస్త్రాలు, సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ ఆధ్వర్యంలో 5 ఏళ్లలోపు ఉన్న చిన్నారులకు పలక, బలపం అందించి వేదపండితులచే శాస్త్రోక్తంగా అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టారు.



పుష్పయాగానికి ఊరేగింపు

ముత్యాలమ్మ ఆలయంలో..

మండల పరిధిలోని ఆళత్తూరు గ్రామ సమీపంలో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. అనంతరం అమ్మవారిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

వైభవంగా నవరాత్రులు

పుత్తూరు: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని ఆరేటమ్మ, ద్రౌపదమ్మ, కామాక్షమ్మ, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లోని అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి, భక్తులు దర్శనభాగ్యం కల్పించారు. కామాక్షీదేవిని శివపూజాదేవిగా, ఆరేటమ్మ సరస్వతీదేవిగా భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం పట్టణ పురవీధుల్లో అమ్మవార్ల ఊరేగింపు నిర్వహించారు.

మహిషాసుర మర్దినీ.. శైలసుతే..

నగరి: దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం నగరి నియోజకవర్గంలోని దేవీ ఆలయాల్లో అమ్మవార్లను పలు రూపాల్లో అలంకరించారు. దర్శించుకోవడానికి భక్తులు ఆలయాలకు క్యూకట్టారు. నేత్రప్రదాయిని దేశమ్మ దేవత ఆలయంలో అమ్మవారు మహిషాసుర మర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. పట్టణ పరిధిలోని కరకంతేశ్వరాలయంలో కామాక్షి అమ్మవారికి సరస్వతి అలంకరణ చేశారు. టీటీడీ ఆధీనంలోని బుగ్గ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవికి మహాగౌరి అలంకారం చేశారు. స్థానిక ఓంశక్తి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారి చిత్రపటానికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయం భక్తులకు అన్నదానం చేశారు. మాంగాడు గ్రామంలో అలిమేలు మంగమ్మకు ప్రత్యేక అలంకరణ చేయగా భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారికి రూ.13 వేలు విలువగల ప్రభ, శిరస్సును పీఏసీఎస్ సీఈఓ తులసిపిళ్లై విరాళంగా అందించారు.

మాజీ మంత్రి ఆర్కే రోజా నవరాత్రి పూజలు

మాజీ మంత్రి ఆర్కే రోజా నవరాత్రి పూజల్లో భాగంగా ఆమె స్వగృహంలో కలశపూజలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహాలకు పసుపుతో అభిషేకం చేసి, పట్టువస్త్రాలతో అలంకరించారు. ఎరుపు వర్ణ పుష్పాలతో పూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.